సాక్షి మంచిర్యాల

శనివారం । 11 । మే । 2024



బల్దియాలో బయోమైనింగ్

మంచిర్యాల మున్సిపాలిటీలో చెత్తను ఎరువుగా మార్చే బయోమైనింగ్ ప్రారంభం కానుంది. దీంతో ఆండాళమ్మకాలనీలోని డంపింగ్ యార్డు సమీప ప్రజల ఇబ్బందులు తీరనున్నాయి. 2లో▸



అమ్మ చెంత విత్తనపూజ

జంగుబాయి క్షేత్రం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గ్రామాల్లో వానాకాలం సాగుకు సంబంధించి ఆదివాసీలు విత్తన పూజలకు శనివారం నుంచి శ్రీకారం చుట్టనున్నారు. 2లో▸

గరిష్టం/కనిష్టం
38.0 /28.0

వాతావరణం

ఆకాశం ఉదయం వేళ ప్రకాశవంతంగా, రాత్రి వేళ మేఘావృతమై ఉంటుంది. ఉత్తరం దిశగా వేడిగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

ప్రచారం పరిసమాప్తం!

- నేటి సాయంత్రం 4గంటల వరకే అనుమతి
- బంద్ కానున్న ఎన్నికల ప్రచార మోత



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: లోక్‌సభ ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రం 4గంటలకు పరిసమాప్తం కానుంది. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోలింగ్‌కు 48గంటల ముందే ప్రచారం నిలిపి వేయాల్సి ఉంటుంది. దీంతో చివరి రోజు అభ్యర్థులు ప్రతీ నిమిషాన్ని వినియోగించుకునేందుకు కసరత్తు చేస్తున్నారు. గత నెల 29న నామినేషన్ల ప్రక్రియ పూర్తయినప్పటి నుంచి బరిలో ఉన్న అభ్యర్థులు తీరిక లేకుండా ప్రచారంలోనే గడిపేస్తున్నారు. ప్రధాన పార్టీ అభ్యర్థులు, స్వతంత్రులు పోటాపోటీగా ప్రజల్లో తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. ఎండ, వానలోనూ పట్టణాల నుంచి మారుమూల గ్రామాల దాకా పర్యటించారు. ఒకరిని మించి మరొకరు అన్నట్లుగా వాడీవేడిగా ప్రచారం సాగించారు. ప్రచార సమయంలో అభ్యర్థులు ప్రత్యర్థులపై మాటల తూటాలు పేల్చారు. విమర్శలు, ఆరోపణలు చేస్తూ ఓట్లు కొల్లగొట్టేందుకు దూకుడుగా వెళ్తున్నారు. పోలింగ్ తేదీ సమీపిస్తున్న కొద్దీ విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకులతో బహిరంగ సభలు, బైక్ ర్యాలీలు, కార్నర్ మీటింగ్‌లు నిర్వహించారు. ప్రతిపక్షంలో ఉన్న పార్టీల అభ్యర్థులు అభివృద్ధి లోటుపాట్లు, గెలిపిస్తే హామీలు కురిపించారు. అధికారంలో ఉన్న నాయకులు తాము చేసిన, చేస్తున్న పథకాలు, చేయబోయే కార్యక్రమాలు వివరించారు.

సీఎం సభ లేనట్లే..

పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో కీలకంగా ఉన్న మంచిర్యాల జిల్లాలో పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభ ఉంటుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు భావించారు. ప్రచార గడువు శనివారంతో ముగియనుండగా సీఎం సభ లేకుండా పోయింది. అంతేగాక కాంగ్రెస్ అగ్ర నాయకులెవరూ జిల్లాలో ప్రచార సభ నిర్వహించలేదు. జిల్లా కేంద్రంలో ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ దీపాదాస్ మున్షీ ముఖ్య అతిథిగా పట్టణ స్థాయి బహిరంగ సభ జరిగింది. అంతకుమించి ముఖ్య నాయకులెవరూ రాలేదు. బీజేపీ నుంచి ప్రచారం కేవలం స్థానిక నాయకులతోనే ముగించారు. బీజేపీ సీనియర్ నేత, మధ్యప్రదేశ్ పార్టీ ఇన్‌చార్జి మురళీధర్‌రావు మంచిర్యాల పట్టణంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. అంతకుమించి జిల్లాలో రాష్ట్ర, జాతీయ స్థాయి ముఖ్య నాయకులు, క్యాంపెయిన్ స్టార్లు ప్రచారంలో పాల్గొనలేదు. దీనిపై బీజేపీ కేడర్‌లోనే నారాజ్ ఉంది. రాష్ట్రంలోని పలు పార్లమెంటు స్థానాల్లో హోరాహోరీగా ఉన్న చోట్ల కేంద్ర మంత్రులు, రాష్ట్రాల ముఖ్యమంత్రులు, స్టార్ క్యాంపెయినర్లు పర్యటించారు. పొరుగున పెద్దపల్లి జిల్లాలోనూ నాయకులు వచ్చినా జిల్లాకు రాలేదు. ఇక బీఆర్‌ఎస్ నుంచి ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ జిల్లా కేంద్రంలో బస్సు యాత్రలో భాగంగా రోడ్ షో నిర్వహించారు. కేసీఆర్ రాకతో ఆ పార్టీ నాయకుల్లో జోష్ నింపింది. అంతేకాక చివరి రోజున ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌తో చెన్నూరులో ప్రజా ఆశీర్వాద సభ పేరుతో భారీ బహిరంగ సభ తలపెట్టారు. ఈ సభను సక్సెస్ చేసేందుకు గులాబీ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నారు.

వేసవిలోనూ నిరంతరం మంచినీటి సరఫరా



ఎల్లంపల్లి ప్రాజెక్ట్ వద్ద కలెక్టర్ సంతోష్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): వేసవిలో ఎక్కడా మంచినీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా మెరుగైన సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ బి.సంతోష్ తెలిపారు. శుక్రవారం హాజీపూర్ మండలం గుడిపేట శివారులోని గోదావరి నదిపై ఉన్న ఎల్లంపల్లి శ్రీపాద ప్రాజెక్టును సందర్శించి ఇంటెక్ వెల్ పరిసరాల్లో మంచినీటి వనరులను పరిశీలించారు. కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ వేసవి పూర్తయ్యే వరకు ప్రత్యేక కార్యాచరణతో నీటి సమస్యలు తలెత్తకుండా చూస్తున్నట్లు తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎలాంటి సమ్యలు ఎదురైనా పరిష్కరించేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. పైప్‌లైన్ లీకేజీలు, బోర్‌వెల్ మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా పునరుద్ధరించాలని తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్, మిషన్ భగీరథ ఈఈ మధుసూదన్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

- మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్



మెడికల్ కిట్లు అందజేస్తున్న డీసీపీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పార్లమెంటు ఎన్నికల విధుల్లో పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో పోలీసు సిబ్బందికి ఎన్నికల విధుల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లోకి ఓటర్ల మొబైల్ ఫోన్‌లు, మంటకు కారణమయ్యే వస్తువులు తీసుకెళ్లకుండా కుణ్ణంగా పరిశీలించాలని, పోలింగ్ కేంద్రంలోకి ఓటరు స్లిప్పులు, గుర్తింపు కార్డులు ఉంటేనే అనుమతించాలని తెలిపారు. ఎన్నికల విధులకు హాజరవుతున్న సిబ్బంది ఓఆర్‌ఎస్, మెడికల్ కిట్లు అందజేశారు. సమావేశంలో బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్‌భాషా, మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాశ్, అసిస్టెంట్ కమాండెంట్ నాగేశ్వర్‌రావు, పోలీస్ అధికారులు, బెటాలియన్ పోలీస్ సిబ్బంది, శిక్షణ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ప్రజా ఆశీర్వాద సభ విజయవంతం చేయండి



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న బాల్క సుమన్

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలో శనివారం ఉదయం 10గంటలకు నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ కోరారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెద్దపల్లి పార్లమెంటు బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వాల శ్రీనివాస్‌రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, రాంలాల్‌గిల్డా, రెవెల్లి మహేశ్, కృష్ణ, మహేందర్, శ్రావణ్, తుమ్మ రమేశ్ పాల్గొన్నారు.

'ఆఖరి గింజ వరకు కొనుగోలు చేస్తాం'

నస్పూర్: జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా నిబంధనల మేరకు రైతుల నుంచి ఆఖరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గ్రామీణాభివృద్ధి సంస్థ, ఐకేపీ, ప్రాథమిక సహకార సంఘాల పరిధిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 8,834 మంది రైతుల నుంచి 63,166 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.55.71 కోట్లు చెల్లించినట్లు పేర్కొన్నారు. ధాన్యం తడిసినట్లయితే ఆరబెట్టి తీసుకు వస్తే కొనుగోలుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇతర వివరాలు, సందేహాల నివృత్తికి 6303928682 నంబరులో సంప్రదించాలని సూచించారు.

కాంగ్రెస్‌తోనే ప్రజాపాలన

- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ పార్టీతోనే ప్రజాపాలన సాధ్యమని, ప్రజలంతా ఏకమై ఈ నెల 13న జరిగే పెద్దపల్లి పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని 8, 9వ వార్డు పాతమంచిర్యాల, బైపాస్ రోడ్డులోని తెలంగాణ తల్లి విగ్రహం దగ్గర శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచారంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖతో కలిసి మాట్లాడారు. వచ్చే మూడేళ్లలో మంచిర్యాల నియోజకవర్గంలో హైదరాబాద్‌లో ఉండే విధంగా కార్పొరేట్ స్థాయి విద్య అందిస్తామని, అభివృద్ధి పనులు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం చేపడతామని అన్నారు. ఐబీ ఆవరణలో ఎంసీహెచ్ నిర్మాణం కోసం ప్రక్రియ పూర్తయ్యిందని అన్నారు. తాను ఎమ్మెల్యే అయిన మూడు నెలలకే నిరంతరం తాగు నీరు అందేలా చేశానని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తోందని తెలిపారు.

అంగన్‌వాడీల రిటైర్మెంట్..!

- టీచర్లు, ఆయాల వివరాల సేకరణ
- జిల్లాలో 65ఏళ్లు దాటిన వారు 127మంది
- ఇప్పటికే టీచర్లు, ఆయాల పోస్టులు ఖాళీలు
- ఉద్యోగ విరమణతో మరిన్ని ఖాళీలు



జిల్లా కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం

మంచిర్యాలటౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లోని టీచర్లు, ఆయాల రిటైర్మెంట్ ప్రక్రియకు రాష్ట్ర మహిళా అభివృద్ధి శాఖ ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాలో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల(ఆయా) వివరాలను ప్రాజెక్టుల వారీగా, వారి పుట్టిన తేదీ, వయస్సు తదితర వివరాలను నిర్ణీత ప్రొఫార్మాలో జిల్లా సంక్షేమశాఖ అధికారి నుంచి క్షేత్రస్థాయిలో శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి(సీడీపీఓ) ద్వారా సేకరిస్తోంది. గతంలోనే అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు ఉద్యోగ విరమణ ప్రక్రియ చేపట్టేందుకు ప్రయత్నించినా.. వారు రిటైర్మెంట్ సమయానికి ఇచ్చే ప్యాకేజీపై రాష్ట్ర వ్యాప్తంగా టీచర్ల నుంచి తీవ్ర అభ్యంతరాలు వచ్చాయి. దీంతో గత కొన్నాళ్లుగా రిటైర్మెంట్ ప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా 80 ఏళ్లు పైబడిన వారిలో ఐదుగురు ఉండగా, అందులో నలుగురు అంగన్‌వాడీ ఆయాలు, ఒక టీచరు ఉన్నారు. 70 ఏళ్లు పైబడిన వారిలో 63 మంది ఉన్నారు. జిల్లావ్యాప్తంగా మొత్తంగా 65 ఏళ్లు దాటిన వారు 127 మంది ఉన్నారు. గత ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగుల వయోపరిమితిని మూడేళ్లు పెంచడంతో అన్ని రకాల పదవీ విరమణలు ఆగిపోయాయి. వాటితోపాటు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల రిటైర్మెంట్లూ నిలిచిపోయాయి. గత మార్చి నెల నుంచి ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్లు ప్రారంభం కావడంతో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల వయస్సు 65 ఏళ్లు నిండితే వారికి రిటైర్మెంట్ ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇందుకోసమే అన్ని జిల్లాల నుంచి టీచర్లు, ఆయాలకు సంబంధించిన వివరాలు, వారి పుట్టిన తేదీ వివరాలను ఒక ప్రొఫార్మాలో తీసుకుని సిద్ధం చేశారు.

జిల్లా వివరాలు

అంగన్‌వాడీ కేంద్రాలు	969
టీచర్లు	893
ఖాళీలు	76
ఆయాలు	729
ఖాళీలు	240
చిన్నారులు	35,560
గర్భిణులు	4880
65 ఏళ్లు నిండినవారు	
టీచర్లు	17
ఆయాలు	110

ప్యాకేజీపైనే అభ్యంతరాలు..!

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు రిటైర్మెంటుకు ఎలాంటి ఆర్థిక సహాయం అందించే అంశం లేకపోవడంతో వారికి ప్యాకేజీని అందించి వారి వయస్సు 65 ఏళ్లు దాటితే రిటైర్మెంట్ చేయాలని భావిస్తోంది. ఏప్రిల్ నెలతో 65 ఏళ్లు దాటిన వారి వివరాలను సేకరించగా, రిటైర్మెంట్ అయ్యే అంగన్‌వాడీ టీచర్‌కు రూ.లక్ష, మినీ అంగన్‌వాడీ టీచర్, హెల్పర్‌కు రూ.50 వేల ప్యాకేజీ కింద అందించడంతోపాటు రిటైర్మెంట్ సమయం నుంచి వారికి ఆసరా పింఛన్ ఇచ్చేలా ప్యాకేజీలో ఉంది. దీనిపై గతంలోనే అంగన్‌వాడీ టీచర్‌కు రూ.2 లక్షలు, హెల్పర్(ఆయా)లకు రూ.లక్ష ఇవ్వాలన్న డిమాండ్ ఉండగా, ప్రభుత్వ ప్యాకేజీపై తీవ్ర వ్యతిరేకత రావడం, ఆ తర్వాత రిటైర్మెంట్ ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో ఇన్నాళ్లు ప్యాకేజీ అంశంపై టీచర్లు, ఆయాలు మౌనంగానే ఉన్నారు.

పెరగనున్న ఖాళీలు

అంగన్‌వాడీ కేంద్రాలు జిల్లాలో 969 ఉన్నాయి. టీచర్లు 893 మంది మాత్రమే పనిచేస్తుండగా 76 పోస్టులు ఖాళీ ఉన్నాయి. హెల్పర్(ఆయా) పోస్టులు 729 ఉండగా, 240 ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వం ఈ నెల లేదా వచ్చే నెలలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల రిటైర్మెంట్‌ను ప్రకటిస్తే మాత్రం మరో 17 మంది టీచర్లు, 110 మంది ఆయాలు రిటైర్ అవుతారు. దీంతో ఖాళీల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. గత ఏడాదిగా టీచర్, ఆయా పోస్టుల ఖాళీలను భర్తీ చేస్తామని అధికారులు చెబుతున్నా ఆ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ఖాళీగా ఉన్న కేంద్రాలను సమీపంలోని ఇతర అంగన్‌వాడీ టీచర్లకు అప్పగించి నిర్వహిస్తున్నారు. నిత్యం చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారం అందించే టీచర్లకు.. వారి కేంద్రంతోపాటు మరో కేంద్రానికి ఇంచార్జి బాధ్యతలు అప్పగించడం వల్ల రెండు కేంద్రాల్లో పూర్తిస్థాయి విధులు నిర్వర్తించలేని పరిస్థితి ఎదురవుతోంది. ప్రస్తుతం ఉన్న ఖాళీలను భర్తీ చేస్తే టీచర్లు, ఆయాలు రిటైర్ అయినా కొంత ఇబ్బందులు తగ్గే అవకాశం ఉంది.

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్



పాల్గొన్న కలెక్టర్ సంతోష్, అధికారులు

నస్పూర్: పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా ఈ నెల 13న జరిగే పోలింగ్‌ను పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అన్నారు. శుక్రవారం ఆయన ఇతర ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, సహాయ ఎన్నికల అధికారులతో ఎన్నికల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ పోలింగ్‌లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ ఆలస్యం కాకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈవీఎం పంపిణీ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలని అన్నారు. జిల్లా ఎన్నికల అధికారి సంతోష్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. సీ విజిల్, కంట్రోల్‌రూమ్, టోల్ ఫ్రీ ద్వారా అందుతున్న ఫిర్యాదులపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అదనపు కలెక్టర్ బి.రాహుల్, ఆర్డీఓ రాములు, ప్రత్యేక ఉప పాలనాధికారి డి.చంద్రకళ, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ఎట్టకేలకు వీడిన ఉత్కంఠ

- కోర్టు కేసుతో లెక్కింపు కేంద్రంలోనే పోలింగ్ సామగ్రి
- కలెక్టరేట్‌లోని గోదాముకు ఈవీఎం, వీవీ ప్యాట్లు తరలింపు



ఈవీఎంలు పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల ఐజా కళాశాలలోని లెక్కింపు కేంద్రంలో ఉన్న ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు ఎట్టకేలకు శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని గోదాముకు తరలించారు. కోర్టు మధ్యంతర ఉత్తర్వుల మేరకు మిగతా పోలింగ్ సామగ్రి లెక్కింపు కేంద్రంలోనే ఉంచారు. వివరాలిలా ఉన్నాయి. గత ఏడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఎమ్మెల్యేగా గెలుపొందిన విషయం తెలిసిందే. ఫలితాలు వెలువడిన నాటి నుంచి 45రోజులపాటు ఈవీఎంలు, వీవీ ప్యాట్లు, పోస్టల్‌బ్యాలెట్ పేపర్లు, వీవీ ప్యాట్లలోని స్లిప్పులు, మాక్‌పోల్ ధ్రువపత్రాలు, పీఓ డైరీ, టెండర్ బ్యాలెట్ పేపర్లు తదితర ఎన్నికల సామగ్రి స్ట్రాంగ్ రూముల్లోనే భద్రపరిచి ఉన్నాయి. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు తన ఎన్నికల తన అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చారని రఘునాథ్ కోర్టును ఆశ్రయించారు. దీంతో మంచిర్యాల నియోజకవర్గం మినహా చెన్నూర్, బెల్లంపల్లి నియోజవర్గాల ఎన్నికల సామగ్రి ఈ ఏడాది జనవరి 17వరకు ఐడీఓసీలోని స్ట్రాంగ్ రూముకు చేరాయి. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఈవీఎం, వీవీ ప్యాట్లు విడుదల చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సంతోష్ కోర్టును ఆశ్రయించడంతో మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు శుక్రవారం ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో పోస్టల్ బ్యాలెట్ పేపర్లు, వీవీ ప్యాట్లలోని స్లిప్పులు, మాక్‌పోల్ ధ్రువ పత్రాలు, పీఓ డైరీ, టెండర్ బ్యాలెట్ పేపర్లు తదితర ఎన్నికల సామగ్రి మినహా ఈవీఎం, వీవీ ప్యాట్లు తరలించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, కేసుతో ప్రమేయం ఉన్న వారి సమక్షంలో ఈవీఎంలు విడుదల చేసి తరలించినట్లు కలెక్టర్ సంతోష్ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, ఆర్డీఓ రాములు, ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కాగా, ఎన్నికలు ముగిసిన అనంతరం కోర్టు ఈపీ కేసు విచారణ చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

ఐటీఐలో కొత్త కోర్సులు

- రూ.ఐదు కోట్లతో భవనాలు, మౌలిక వసతుల కల్పన
- ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు



ఐటీఐ భవనం

మంచిర్యాలఅర్బన్: పేద, మధ్యతరగతి విద్యార్థులకు చదువుతోపాటు ఉపాధికి దోహదం చేస్తున్న ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లను భవనాలు, పరికరాలు, మౌలిక వసతులతో ఆధునీకరించనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఆధునీకరణలో భాగంగా టాటా టెక్నాలజీస్ లిమిటెడ్(టీటీఎల్)తో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. రూ.5కోట్ల వ్యయంతో నూతన భవనం పనులు చేపట్టాల్సి ఉంది. ఇప్పటికే డిపార్ట్‌మెంట్ అన్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో టెండర్లు పూర్తయ్యాయి. ఈ విద్యాసంవత్సరం నుంచి మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐలో ఆరు నూతన కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, టర్నర్, మెకానిక్, వెల్డర్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ (కోపా), సోలార్ టెక్నీషియన్, ఫ్యాషన్ డిజైన్ టెక్నాలజీ కోర్సులు ఉండగా.. 432 సీట్లు ఉన్నాయి. ఐటీఐల ఆధునీకరణతో డిమాండ్ ఉన్న కొత్త కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెకానిక్ టెక్నీషియన్ కోర్సులో 48 సీట్లు, ఇండస్ట్రియల్ రొబొటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫాక్చరింగ్ 40, మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమిషన్ 40, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ 48, ఆర్టీషియన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్‌టూ 48, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్(మెకానికల్) కోర్సులో 48 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ ఐటీఐల ఆధునీకరణతో సమస్యలు తీరిపోనున్నాయని, కోర్సులు ఈ విద్యాసంవత్సరం నుంచే ప్రారంభించే అవకాశాలున్నాయని ఐటీఐ ప్రిన్సిపాల్ చందర్ తెలిపారు.

నేడు ఓటరు చైతన్యంపై 5కే రన్

పాతమంచిర్యాల: పార్లమెంటు సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఓటరు చైతన్యంపై జిల్లా కేంద్రంలో శనివారం 5కే రన్ నిర్వహించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటలకు ఐబీ చౌరస్తా నుంచి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల వరకు రన్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని యువతీ, యువకులు, స్వచ్ఛంద సంస్థలు, మహిళలు, ఉద్యోగులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'రిజర్వేషన్ల వ్యతిరేక బీజేపీని ఓడించాలి'



మాట్లాడుతున్న మహేశ్వరరాజ్, వినోద్

బెల్లంపల్లి: రిజర్వేషన్ల వ్యతిరేక బీజేపీని ఓడించాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు తీరని అన్యాయం చేయాలని చూస్తోందని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్వరరాజ్ అన్నారు. శుక్రవారం రడగంబాల బస్తీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి మోదీ నిమ్న వర్గాలను అణిచివేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఓటమి భయంతోనే మత రాజకీయాలు చేస్తున్నారని, రాజ్యాంగానికి వ్యతిరేకంగా రిజర్వేషన్లను తొలగిస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉందని అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. ఇండియా కూటమి అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్, సమాఖ్య నాయకులు నాగుల శ్రీనివాస్ యాదవ్, హబీబ్ అహ్మద్, నీలకంఠేశ్వర రావు, భీమ్‌సేన్, అడ్డూరి వెంకటస్వామి, ఎండీ మునీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీకి విద్యార్థుల ఎంపిక



దుగుట అంజి



ఎలుపుల రాజేందర్



గొల్ల బలరాముడు

బెల్లంపల్లి: అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ(ఏపీయూ)కి బెల్లంపల్లిలోని తెలంగాణ ప్రభుత్వ సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ(సీఓఈ) విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారు. జాతీయ స్థాయిలో రెండో దఫా జరిగిన రాత పరీక్షల్లో ప్రతిభను చాటారు. గురువారం వెలువడిన ఫలితాల్లో సీఓఈలోని ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు దుగుట అంజి బీఏ హానర్స్(సోషల్ సైన్స్), ఎలుపుల రాజేందర్, గొల్ల బలరాముడు బీఏ హానర్స్(హిస్టరీ)లో అడ్మిషన్ సాధించినట్లు సీఓఈ ప్రిన్సిపాల్ ఐనాల సైదులు ప్రకటించారు. వీరికి బోపాల్ యూనివర్సిటీలో సీటు వచ్చినట్లు వెల్లడించారు. సదరు విద్యార్థులు 2024–25 సంవత్సరానికి గాను అండర్‌గ్రాడ్యుయేషన్ చదవనున్నారు. విద్యార్థులను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రభుత్వ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ రీజినల్ కోఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి ప్రత్యేకంగా అభినందించారు. కాగా, అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ గత జనవరిలో మొదటి దఫా అడ్మిషన్ టెస్ట్ ఫలితాలను వెల్లడించింది. ఈ ఫలితాల్లో సీఓఈ విద్యార్థులు పుల్లూరి దీపక్, గడపల సుమేధ్, నగమల్ల గణేష్, బత్తుల మధు, బండారి శివమూర్తి అండర్ గ్రాడ్యుయేషన్‌లో సీటు దక్కించుకున్నారు. కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సదరు విద్యార్థులను ప్రిన్సిపాల్ సైదులు, అధ్యాపకులు అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ కోట రాజ్‌కుమార్, అధ్యాపకులు, సీఓఈ కళాశాల పేరెంట్స్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పూదరి నగేష్‌గౌడ్, గోగర్ల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఓటేద్దాం రండి సీడీ ఆవిష్కరణ



సీడీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సంతోష్

నస్పూర్: జిల్లా కేంద్రానికి చెందిన కవి, రచయిత, రాష్ట్రపతి అవార్డు గ్రహీత గుండేటి యోగేశ్వర్ రచించి రూపొందించిన ఓటేద్దాం రండి అనే ఓటరు చైతన్యగీతం సీడీని కలెక్టర్ బదావత్ సంతోష్ కలెక్టరేట్ ఏఓ పిన రాజేశ్వర్‌తో కలిసి ఆవిష్కరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఓటర్లలో చైతన్యం తీసుకు రావడానికి ప్రత్యేక గీతాన్ని రాసి ఆకర్షణీయంగా రూపొందించిన యోగేశ్వర్‌ను కలెక్టర్ అభినందించారు. కాగా గీతాన్ని జిల్లా పౌర సంబంధాల శాఖ తెలంగాణ సాంస్కృతిక సారథి కళా బృందం ఆలపించారు.

ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై ఫిర్యాదు

బెల్లంపల్లి: పెద్దపల్లి పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని ఆరిజిన్ డెయిరీ సీఏఈ బోడపాటి శేజల్ ఎన్నికల సంఘానికి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా బెల్లంపల్లి మండలంలో ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న ప్రాంతానికి వెళ్లి ప్రచారం చేశారని పేర్కొన్నారు. ఈ మేరకు స్పందించిన చీఫ్ ఎలక్ట్రోరల్ అధికారి వికాస్‌రాజ్ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ పెద్దపల్లి జిల్లా ఎన్నికల అధికారికి ఉత్తర్వులు జారీ చేశారు.

కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశాలు

మంచిర్యాలటౌన్: వచ్చే 2024–25 విద్యా సంవత్సరానికి గాను ప్రైవేటు/కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్‌తోపాటు ఎంసెట్ కోచింగ్ ప్రవేశం పొందేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 15నుంచి 30వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివి, 10వ తరగతిలో 7 జీపీఏ ఆపైన ఫలితాలు సాధించిన ఎస్సీ/ఎస్టీ/బీసీ/మైనారిటీ/దివ్యాంగ విద్యార్థులు ఈ-పాస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పదో తరగతిలో మెరిట్ ఆధారంగా విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా ప్రవేశం కల్పిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు www.telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చని, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చదరంగం ఆటతో మెదడుకు పదును

మందమర్రిరూరల్: చదరంగం ఆట వల్ల క్రీడాకారుల మెదడుకు పదును ఏర్పడి విజ్ఞానవంతులు అవుతారని జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం పట్టణంలోని బురదగూడెం ప్రైవేటు హైస్కూల్‌లో నిర్వహించిన అండర్-17 చదరంగం జిల్లా స్థాయి ఎంపిక పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వజీర్ సుల్తాన్, చదరంగం అభివృద్ధి చైర్మన్ తీగ కనుకయ్య, తిరుపతి రెడ్డి, శోభన్‌రావు, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి మృతి

ఆదిలాబాద్‌టౌన్: బేల మండల కేంద్రానికి చెందిన కనాకే మారుతి (65) ఆదిలాబాద్ పట్టణంలో కొంత కాలంగా భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి 8 గంటల ప్రాంతంలో రిమ్స్ ఎదుట గల అమ్మ హోటల్ ఎదుట కిందపడి మృతిచెందాడు. కొద్ది రోజులుగా ఆహారం లేక, వడదెబ్బకు గురై మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అమ్మ చెంత విత్తన పూజ



జంగుబాయి అమ్మవారి ఆలయ ప్రాంగణం



కొలువైన పోచమ్మ తల్లులు

- నేటి నుంచి నెల రోజులపాటు ఉత్సవాలు
- జంగుబాయి క్షేత్రానికి ఆధ్యాత్మిక శోభ
- ఆలయానికి తరలిరానున్న ఆదివాసీలు
- గ్రామాల్లోనూ కొనసాగనున్న పూజలు

కెరమెరి(ఆసిఫాబాద్): వానాకాలం సాగుకు సమయం సమీపిస్తోంది. జూన్ 7న మృగశిర కార్తె ప్రవేశించనుంది. దీంతో ఆదివాసీలు శనివారం నుంచి విత్తన పూజకు శ్రీకారం చుట్టనున్నారు. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లో కెరమెరి మండలంలోని మహరాజ్‌గూడ అడవుల్లో కొలువైన జంగుబాయి అమ్మవారి చెంత దాదాపు నెల రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించి విత్తనాలు విత్తుకోనున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన జనాభా అధికంగా ఉంది. వారు చేసే ప్రతీ పనిలోనూ సంప్రదాయాలు పాటిస్తారు. సాగు పనుల ప్రారంభానికి ముందే ఆయా గ్రామాల్లోని ఆదివాసీలు గ్రామ పటేల్ ఇంటి వద్ద ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తారు. అనంతరం పాటీరు అమ్మోరు, జంగుబాయి అమ్మవారు, గాంధారి ఖిల్లా, పద్మల్‌పురి కాకో ఆలయాలకు వెళ్లి విత్తన పూజలు నిర్వహిస్తారు. పంటలు సమృద్ధిగా పండాలని దేవతల ఆశీర్వాదం తీసుకుని సొంత గ్రామాలకు తిరుగు ప్రయాణం అవుతారు. తర్వాత స్థానికంగా ఉన్న ఆకీపేన్, అమ్మోర్, పోచమ్మల వద్దకు విత్తనాలను తీసుకెళ్లి మళ్లీ పూజలు చేస్తారు. పటేల్ ఇచ్చే విత్తనాలను ఇళ్లకు తీసుకెళ్తారు. అదేరోజు జొన్న గట్కాతో భోజనం చేసి అర్ధరాత్రి అడవికి వెళ్లి (కుమ్మిడ్) చెట్టు ఆకులు తెస్తారు. ఆ ఆకులతో డొప్పలు తయారు చేసిన పూజలు చేసిన విత్తనాలు అందులో ఉంచుతారు. ఇదంతా మృగశిర కార్తెకు ముందే పూర్తి చేస్తారు.

సంప్రదాయబద్ధంగా మొహతుక్ పూజలు

గ్రామాల్లో విత్తన పూజలు(మొహతుక్) పూజలు సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తారు. విత్తనాలు విత్తుకునే రోజు కుటుంబం మొత్తం చేనుకు వెళ్తారు. అక్కడే జొన్న గట్కా చేసిన కుల దేవతలతోపాటు నేల తల్లికి సమర్పిస్తారు. అనంతరం చేనులో విత్తనాలు చల్లి సాగు ప్రారంభిస్తారు. మరికొన్ని గ్రామాల్లో విత్తన పూజలు విభిన్నంగా జరుపుకొంటారు. ఆదివాసీల దైవమైన చంచి భీమల్ దేవుడి పెళ్లి సందర్భంగా ఏటా ఏప్రిల్, మే నెలల్లో భీమల్ దేవుడికి విత్తనాలు చూపుతారు. ఆ రోజు ఆదివాసీలు ప్రత్యేక పూజలు చేస్తారు. ఆకులతో ఆరు డొప్పలు చేసి అన్ని విత్తనాలు ఒక చోట ఉంచుతారు. భీమల్ దేవుడి పూజల అనంతరం వాటిని ఇళ్లకు తీసుకెళ్లి భద్రపరుస్తారు. మృగశిర కార్తె ప్రారంభమైన తర్వాత దాచిన విత్తనాలతో సాగు పనులు మొదలుపెడతారు.

ఏటా పూజలు చేస్తాం



ఏటా వానాకాలం ప్రారంభానికి ముందే విత్తన పూజలు చేస్తాం. పూజలు చేయకుండా సాగు చేయం. అమ్మవారి ఆశీర్వాదం తీసుకుని పంటలు బాగా పండాలని వేడుకుంటాం. సంప్రదాయబద్ధంగా పూజలు చేసి దేవతలకు మొక్కులు చెల్లించుకుంటాం.

– రాయిసిడాం జంగు, కటోదా

అన్నదాత సంక్షేమానికే తొలి ప్రాధాన్యత

- యువతకు ఉపాధి కల్పించేలా పరిశ్రమలు తీసుకొస్తా
- ఆదిమ గిరిజనుల వికాసానికి కృషి
- 'సాక్షి' ఇంటర్వ్యూలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

ఆదిలాబాద్‌టౌన్/కైలాస్‌నగర్: ఈ ఎన్నికల్లో తనను ఎంపీగా గెలిపిస్తే అన్నదాత సంక్షేమానికే తొలి ప్రాధాన్యం ఇస్తానని బీఆర్ఎస్ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు అన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో వృత్తి నైపుణ్యాభివృద్ధి కేంద్రాలతోపాటు సాంకేతిక విద్య అందించేలా చర్యలు చేపడతానని చెప్పారు. టెక్స్‌టైల్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి పరిశ్రమలతోపాటు ఆసిఫాబాద్, ఆదిలాబాద్ నియోజకవర్గాల్లో పీజీ కళాశాలల ఏర్పాటుపై శ్రద్ధ వహిస్తానని తెలిపారు. అంతేకాకుండా ఆదిమ గిరిజనుల వికాసానికి కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

సాక్షి: మీ ప్రచారం ఎలా సాగుతోంది.. ప్రజల నుంచి స్పందన ఎలా ఉంది?

సక్కు: పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రతీ పోలింగ్ బూత్ పరిధిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు, కేసీఆర్ కిట్, 24 గంటల విద్యుత్ సరఫరా, రైతు భరోసా వంటి పథకాలతో లబ్ధి పొందిన ప్రజలు నన్ను ఆదరిస్తున్నారు.

సాక్షి: ఓటర్లు మీకే ఎందుకు మద్దతు ఇవ్వాలనుకుంటున్నారు?

సక్కు: నోటిఫికేషన్ వచ్చిన వెంటనే ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో తమ పార్టీ తనను మొదట అభ్యర్థిగా ప్రకటించింది. బీజేపీ, కాంగ్రెస్‌లకు అభ్యర్థులు దొరక్క పార్టీలో కనీసం ప్రాథమిక సభ్యత్వం లేని వ్యక్తులను తీసుకొచ్చి టికెట్లు ఇచ్చారు. దీన్నిబట్టి ఆదివాసీల కోసం పనిచేసే వ్యక్తి ఎవరో ప్రజలకు అర్థమైంది. ఆదివాసీల హక్కులు, చట్టాల కోసం పోరాడిన వ్యక్తిగా తనకు సంపూర్ణ మద్దతు లభిస్తుంది.

సాక్షి: రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసినా.. ఆదివాసీల కోసం ఏమీ చేయలేదనే విమర్శలు ఉన్నాయి. దీనిపై మీ స్పందన..?

సక్కు: 2009లో ఎమ్మెల్యేగా గెలిచాక ప్రతీ ఆదివాసీ గూడెంలో పర్యటించా. ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు, జీవో 3 కారణంగా కోల్పోయే ఉద్యోగ అవకాశాలపై తొలిసారిగా మాట్లాడిన వ్యక్తి నేనే. నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాలకు రోడ్ల వసతి కల్పించాను. ఇప్పటివరకు ఏ ఎమ్మెల్యేనైనా ఆదివాసీల కోసం మాట్లాడి పని చేశారా. కుమురంభీం పేరిట స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసి యువతకు శిక్షణ ఇస్తున్నా. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ఏమీ చెప్పుకోలేక తనపై దుష్ప్రచారం చేస్తున్నారు.

సాక్షి: గెలిస్తే నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధికి కృషి చేస్తారు. మీకున్న ప్రాధాన్యాలేంటి..?

సక్కు: పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 90 శాతం మంది రైతులు వ్యవసాయ రంగంపైనే ఆధారపడి ఉన్నారు. ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్, సిర్పూర్(టి) నియోజకవర్గాల్లోని కొన్ని ప్రాంతాల్లో రెండో పంట వేసే అవకాశం లేక రైతులు ఏప్రిల్ నుంచి ఖాళీగానే ఉంటున్నారు. అలాంటి రైతులు రెండో పంటను పండించేలా గిరి వికాసం ద్వారా బోరుబావులు, త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించి వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడమే తొలి ప్రాధాన్యతగా భావిస్తాను. రేపటి తరాలు బాగు పడాలంటే చదువే కీలకం. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణతోపాటు మాతా శిశు మరణాలు జరగకుండా ప్రత్యేక కృషి చేస్తాను.

సాక్షి: యువతకు ఉపాధి కల్పించేలా ఎలాంటి చర్యలు చేపడతారు..?

సక్కు: సాధారణ చదువుతోపాటు వృత్తి నైపుణ్యంతో కూడిన కోర్సులు చదివేలా ప్రతి నియోజకవర్గ కేంద్రంలో కేంద్రాలను ఏర్పాటు చేయిస్తా. జిల్లా కేంద్రంలో పీజీ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తా. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా టెక్స్‌టైల్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయిస్తా. ఆదిమ గిరిజన తెగల కోసం కేంద్రం సీసీడీపీ ద్వారా వేలాది కోట్లను కేటాయిస్తుంది. కానీ గతంలో పనిచేసిన ఎంపీలు ఈ నిధులను రాబట్టడంలో విఫలమయ్యారు. కేంద్రంతో మాట్లాడి ఆ నిధులు తీసుకొచ్చి అభివృద్ధి జరిగేలా చూస్తా.

సాక్షి: ఏజెన్సీలో గిరిజనేతరులు భూ హక్కుల కోసం దశాబ్దాలుగా పోరాడుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి ఎలా ముందుకెళ్తారు..?

సక్కు: వాస్తవానికి ఎలాంటి సమస్య లేదు. ఏజెన్సీ చట్టాల ప్రకారం ఆదివాసీలకే హక్కులు ఉంటాయి. కొంత మందికి పట్టాలు లేకపోవడంతో గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు అందలేదు. అలాంటి వారికి లబ్ధి చేకూర్చేలా దళితబంధు, దళితబస్తీ, బీసీబంధు, మైనార్టీ బంధు పథకాల ద్వారా ప్రాధాన్యతనిచ్చి లబ్ధి చేకూర్చాం. సాంకేతిక కారణాలతో కొంత మంది ఇబ్బందులు పడుతున్నమాట వాస్తవమే. దీనిని పరిష్కరించేందుకు కృషి చేస్తా.

సాక్షి: ఈ ఎన్నికల్లో మీకు ప్రధాన పోటీదారుగా ఎవరిని భావిస్తారు..?

సక్కు: నాకు పోటీయే లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు నన్ను గెలిపిస్తాయి. కాంగ్రెస్ ఐదు నెలల పాలనలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కదాన్నీ అమలు చేయలేదు. అలాంటప్పుడు ప్రజలు ఆ పార్టీకి ఎందుకు ఓటేస్తారు. ఎంపీగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసినా ప్రజలకు ఎలాంటి మేలు చేయని మరో అభ్యర్థి తీరును ప్రజలు గుర్తించారు. దీంతో ప్రజల ఆదరణ నాకే ఉంది.

'కూటమి అభ్యర్థిని గెలిపించాలి'



మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్: ఎన్నికల్లో ఇండియా కూటమి పెద్దపల్లి నియోజకవర్గం అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన ఎస్ఆర్పీ 1 గనిపై అభ్యర్థి గడ్డం వంశీకృష్ణతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గద్దె దిగితేనే కార్మికుల హక్కులకు రక్షణ ఉంటుందని, 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా చేసి కార్మిక వర్గంపై ఉక్కు పాదం మోపారని అన్నారు. సింగరేణి కార్మికుల సమస్యలు, హక్కుల సాధన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, హామీలు నెరవేరడానికి ఎంపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని కార్మికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే.వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే.బాజీసైదా, సహాయ కార్యదర్శి మోతుక్కూరి కొమురయ్య, నాయకులు చంద్రమోహన్, భద్రి బుచ్చయ్య, మల్లేష్, అఫ్రోజ్ ఖాన్, దాడి రాజయ్య, మురళి చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ గెలిస్తేనే ప్రైవేటీకరణకు అడ్డుకట్ట'



మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

శ్రీరాంపూర్: పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తేనే కేంద్రం చేపట్టిన బొగ్గు గనుల ప్రైవేటీకరణకు అడ్డుకట్ట పడుతుందని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన నస్పూర్- శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాడు మోదీ నాలుగు బొగ్గు బ్లాకులను ప్రైవేటు పరం చేసి వేలం వేయడానికి చూస్తే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అడ్డుకుందని తెలిపారు. బీఆర్ఎస్ ఉంటేనే సింగరేణికి రక్షణ ఉంటుందని, కమర్షియల్ మైనింగ్ పేరుతో గనులను ప్రైవేటు సంస్థలకు ధారదత్తం చేసే కుట్ర జరుగుతోందని, ఇలాంటి తరుణంలో పార్లమెంటులో సింగరేణి గళం వినిపించడానికి బీఆర్ఎస్ ఎంపీలు ఉండాలని అన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను కార్మికవర్గం ఆదరించి గెలిపించాలని కోరారు. యూనియన్ బ్రాంచ్ ఇంచార్జీ పెట్టం లక్ష్మణ్, మాజీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, నాయకులు పానుగంటి సత్తయ్య, వెంకట్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, పోశం, అన్వేష్‌రెడ్డి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌లో కత్తిపోట్ల కలకలం

- ఒకరు మృతి, మరొకరికి గాయాలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో కత్తిపోట్ల ఘటన కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని చిక్కడ్‌పల్లికి చెందిన జీషాన్ బుధవార్‌పేట్‌కు చెందిన మతిన్ ఇద్దరు స్నేహితులు. రాంనగర్ ప్రాంతానికి చెందిన సుమేర్ వీరికి తెలిసిన వ్యక్తి. వ్యక్తిగతంగా ఏదో విషయం గురించి మాట్లాడుకుందామని మతిన్‌ను సుమేర్ పిలిచాడు. మినీ ట్యాంక్‌బండ్ వద్దకు రావాలని కోరారు. దీంతో మతిన్ తన స్నేహితుడు జీషాన్‌ను తీసుకుని శుక్రవారం సాయంత్రం వెళ్లాడు. ఆ సమయంలో వారిమధ్య మాటా.. మాట పెరిగి ఘర్షణ జరిగింది. దీంతో సుమేర్ తన వద్ద ఉన్న కత్తితో మతిన్, జీషాన్‌పై దాడిచేశాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన జీషాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. మతిన్‌కు ప్రాథమిక చికిత్స చేసి హైదరాబాద్‌కు తరలించారు. నిందితుడు పరారీలో ఉన్నట్లు సమాచారం. ప్రేమ వ్యవహారమే ఈ దాడికి కారణమని అనుమానిస్తున్నారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



మృతుడు కుమార్

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధి గంపలపల్లి గ్రామానికి చెందిన రాజం కుమార్(25) చికిత్స పొందుతూ మృతిచెందాడు. స్థానిక ఎస్సై చంద్రకుమార్ తెలిపి న వివరాల ప్రకారం.. కు మార్ డిగ్రీ పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఏదైనా పని చేసుకోవాలని, పొలం పనులకు రావా లని, ఖాళీగా ఉండకూడదని తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెంది ఈ నెల 8న రా త్రి ఇంటి ఆవరణలో పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల, అక్కడి నుంచి కరీంనగర్ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం రాత్రి చనిపోయాడు. మృతుడి తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



చంద్రమౌళి(ఫైల్)

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఊత్కూరు చౌరస్తా సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణానికి చెందిన చంద్రమౌళి(58) మృతిచెందాడు. స్కూటీ వాహనంపై ఊత్కూరు చౌరస్తా నుంచి మంచిర్యాల వైపు వెళ్తూ రోడ్డు దాటుతుండగా వెనుక నుంచి అతివేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. దీంతో కింద పడిన ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా మృతిచెందినట్లు తెలిసింది. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

పుస్తెలతాడు దొంగ అరెస్టు



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ రవికుమార్

కాసిపేట: మండలంలోని ధర్మరావుపేట లంబాడి తండాలో నిద్రిస్తున్న మహిళ మెడలో నుంచి పుస్తెల తాడును దొంగిలించిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ తెలిపారు. శుక్రవారం దేవాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ధర్మరావుపేట గ్రామానికి చెందిన భట్టు చరణ్ హైదరాబాద్‌లో ఊబర్ మోటారుసైకిల్ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. గ్రామానికి చెందిన అశోక్‌తో కలిసి గత నెల 28న రాత్రి గ్రామంలో నిద్రిస్తున్న మహిళ మెడలో నుంచి బంగారు పుస్తెల తాడును దొంగిలించాడు. నిందితులు జల్సాలకు అలవాటుపడి చోరీలకు పాల్పడుతున్నారు. మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు ఆధ్వర్యంలో రెండు బృందాలు ఏర్పాటు చేసి గాలిస్తున్నారు. పుస్తెలతాడు విక్రయించేందుకు వెళ్తుండగా చరణ్‌ను పట్టుకున్నారు. అతడిని రిమాండ్‌కు తరలించామని, మరో నిందితుడు బొమ్మెన అశోక్ పరారీలో ఉన్నాడని తెలిపారు. ఎస్సైతోపాటు హెడ్ కానిస్టేబుల్ అనిల్‌కుమార్, కానిస్టేబుళ్లు తిరుపతి, సంపత్, అనిల్‌కుమార్, మల్లికార్జున్‌లకు రివార్డు అందజేశారు.

బల్దియాలో బయోమైనింగ్

- చెత్తను ఎరువుగా మార్చే ప్రక్రియ
- రెండ్రోజుల్లో ప్రారంభం
- దాదాపు 16 వేల మెట్రిక్ టన్నుల చెత్త క్లియర్
- తీరనున్న డంపింగ్ యార్డు కష్టాలు



డంపింగ్ యార్డులోని చెత్త

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాల్టీలో బయోమైనింగ్‌కు ఎట్టకేలకు ముందడుగు పడింది. చెత్తను ఎరువుగా మార్చే ప్రక్రియ రెండ్రోజుల్లో ప్రారంభం కానుంది. బల్దియాలోని డంపింగ్‌యార్డులో పేరుకుపోతున్న చెత్తను కంపోస్టు ఎరువుగా తయారీకి ఏడాదిన్నర క్రితం పనులు ప్రారంభించినా ముందుకు సాగలేదు. గతంలోనే కాంట్రాక్టు పొందిన సంస్థ మరో రెండు రోజుల్లో ఆండాళమ్మ కాలనీలోని డంపింగ్ యార్డులో పనులు చేపట్టేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. నిల్వ ఉన్న చెత్తను పూర్తిగా కంపోస్టు ఎరువుగా మార్చి, ప్రస్తుతం ఉన్న డంపింగ్ యార్డులో చెత్త లేకుండా శుభ్రపర్చే ప్రక్రియకు శ్రీకారం చుట్టనుంది. ఇందుకోసం సీడీఎంఏ నుంచి ఓ ప్రైవేటు సంస్థకు ప్రస్తుతం డంపింగ్ యార్డులో ఉన్న చెత్తను పూర్తిగా కంపోస్టుగా తయారు చేసి, దానిని తొలగించేలా పనులు అప్పగించారు. చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. డంపింగ్ యార్డుల్లో కుప్పలుగా పేరుకుపోయిన చెత్త నిల్వలు పూర్తిగా కనుమరుగయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం మంచిర్యాల మున్సిపాలిటీలోని చెత్తను ఆండాళమ్మ కాలనీలోని డంపింగ్ యార్డులో వేస్తుండగా, గుట్టలుగా పేరుకుపోతోంది. దాదాపు 16 వేల మెట్రిక్ టన్నుల చెత్త ప్రస్తుతం డంపింగ్ యార్డులో ఉంది. ఇందులో ప్రతీరోజు వెలువడే 45 మెట్రిక్ టన్నుల చెత్తను వేసేందుకు సరిపడా స్థలం లేకపోవడంతో కాల్చేస్తున్నారు. దీంతో స్థానికులకు చెత్త వాసనతోపాటు పొగ, నల్లటి చూర్ణం ఇళ్లకు చేరి రోగాల బారిన పడుతున్నారు. ప్రస్తుతం చెత్త తొలగించేందుకు ఓ ప్రైవేటు సంస్థకు పనులను అప్పగించడం వల్ల పూర్తిస్థాయిలో తొలగిపోవడంతోపాటు తరువాత వేసే చెత్తను కంపోస్టు ఎరువుగా మార్చుకుంటే భవిష్యత్తులో చెత్త సమస్యకు చెక్ పడినట్లే.

నిరంతరం చేస్తేనే..!

జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలకు డంపింగ్ యార్డు సమస్య ఉంది. తడి, పొడి చెత్తను మున్సిపాలిటీల్లో రోజువారీగా కార్మికులు సేకరించాల్సి ఉంది. ప్రజలు తడి, పొడి చెత్తను కలిపే వేస్తున్నారు. దీనిని ఆటో ట్రాలీలు, ట్రాక్టర్ల ద్వారా నేరుగా డంపింగ్ యార్డులకు కార్మికులు తరలించడం వల్ల ఆ చెత్తను వేరు చేయడం, దానిని కంపోస్టు ఎరువుగా మార్చడం కష్టంగా మారుతోంది. పట్టణ ప్రజలకు తడి, పొడి చెత్తను వేరు చేసేలా అవగాహన కల్పించి రెండే వేర్వేరు చెత్త బుట్టలను అందిస్తున్నా ప్రయోజనం ఉండడం లేదు. డంపింగ్ యార్డులకు సరిపడా స్థలాన్ని కేటాయించకపోవడం వల్ల జిల్లాలోని మంచిర్యాల, నస్పూర్, లక్సెట్టిపేట, చెన్నూరు, క్యాతన్‌పల్లి, మందమర్రి, బెల్లంపల్లి మున్సిపాలిటీల్లో చెత్త పేరుకుపోతోంది. మంచిర్యాల మున్సిపాలిటీకి మాత్రం డంపింగ్ యార్డుకు సరిపడా స్థలాన్ని కేటాయించలేదు. దీంతో ఇరవై ఏళ్ల క్రితం ఆండాళమ్మ కాలనీలో డంపింగ్ యార్డును ఏర్పాటు చేయగా ఇప్పటికీ అదే స్థలంలో చెత్త వేస్తున్నారు. చెత్త నిండిపోతుండడం, తరచూ చెత్త కాలడంతో దట్టమైన పొగ కమ్ముకుంటోంది. మంచిర్యాల మున్సిపాలిటీలో చెత్త తొలగింపు పూర్తయిన తర్వాత మిగతా మున్సిపాలిటీల్లోనూ చెత్త తొలగించనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తరువాత మున్సిపాలిటీల ఆధ్వర్యంలోనే తడి, పొడి చెత్తను వేర్వేరుగా డంపింగ్ యార్డుల్లో వేసి కంపోస్టు ఎరువు తయారు చేసేలా చర్యలు తీసుకోనున్నారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో పెద్ద ఎత్తున చెత్త పేరుకు పోతుండడంతో నిరంతరం బయోమైనింగ్ చేస్తేనే చెత్త నుంచి విముక్తి లభిస్తుంది.

చెత్తను పూర్తిగా తొలగిస్తాం



మంచిర్యాల మున్సిపాలిటీలోని ఆండాళమ్మ కాలనీ డంపింగ్ యార్డులో పేరుకుపోయిన పూర్తి చెత్తను ప్రస్తుతం బయోమైనింగ్ ద్వారా తొలగించేందుకు మరో రెండు రోజుల్లో పనులను ప్రారంభించడం జరుగుతుంది. చెత్తలోని రాళ్లు, పాలిథిన్, వస్త్రాలను వేరు చేస్తారు. వీటిని బయటకు పంపించి, మిగిలిన చెత్తను ఎరువుగా మార్చి డంపింగ్ యార్డును పూర్తిగా శుభ్రం చేస్తారు. ఆ తర్వాత తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేలా చర్యలు తీసుకుని కంపోస్టు ఎరువుగా తయారు చేసేలా చూస్తాం. దీంతో డంపింగ్ యార్డులో చెత్త పేరుకు పోకుండా ఉండేందుకు అవకాశం ఉంది. ఆండాళమ్మ కాలనీ డంపింగ్ యార్డును నస్పూరు మున్సిపాలిటీ పరిధిలోకి మరో రెండు నెలల్లోపు మార్చనుండగా, ఆలోపు డంపింగ్ యార్డును పూర్తి శుభ్రంగా చేయడం జరుగుతుంది.

– మారుతి ప్రసాద్, మంచిర్యాల మున్సిపల్ కమిషనర్